క్లుప్తంగా

కోడుమూరు ఎక్సైజ్ సీఐగా మంజుల



కోడుమూరు రూరల్: కోడుమూరు ఎక్సైజ్ సీఐగా ఎం.మంజుల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న రామాంజనేయులు నందికొట్కూరుకు బదిలీపై వెళ్లడంతో అధికారులు మంజులను సీఐగా నియమించారు. ఈ మేరకు ఆమె విధుల్లో చేరి సర్కిల్ పరిధిలోని సమస్యలపై ఎక్సైజ్ సిబ్బందితో చర్చించారు. ఇదిలా ఉండగా.. బదిలీపై నందికొట్కూరు సీఐగా వెళ్లిన రామాంజనేయులును సోమవారం స్థానిక ఎక్సైజ్ సిబ్బంది సత్కరించారు.

గ్రామాల్లో పనులు గుర్తించండి

కల్లూరు : గ్రామ సభలు నిర్వహించి ఉపాధి పనులు గుర్తించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి 2024–25 సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు. ఏపీఓ మద్దేశ్వరమ్మ మాట్లాడుతూ వచ్చే ఫీల్డ్ అసిస్టెంట్లు ఇంకుడు గుంతల పనులను గుర్తించాలని చెప్పారు. ఈనెల 2న గాంధీ జయంతి సందర్భంగా గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశించారు.

రెండు చోట్ల ఓట్లు ఉన్న ఓటర్లకు నోటీసులు



డబుల్ ఓటర్లకు నోటీసులను సిద్ధం చేస్తున్న సిబ్బంది

సి.బెళగల్: రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగిన ఓటర్లకు నోటీసులు జారీ చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలానికి చెందిన 637 మంది ఓటర్లు.. మండలంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నారని, వారందరికి నోటీసులు పంపుతామని చెప్పారు. నోటీసులు అందుకున్న వారు అవసరమైన చోట ఓటును ఉంచుకుని, తొలగించాల్సిన ప్రాంతం వివరాలను తమకు తెలియజేయాలని సూచించారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది మణి, మధు, శివ తదితరులు ఓటర్లకు పోస్టులో నోటీసులు పంపించే పనుల్లో నిమగ్నమయ్యారు.

ఈఓ బాధ్యతల స్వీకరణ



ఈఓలను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

ఓర్వకల్లు: ఓర్వకల్లు గ్రూపు దేవస్థానం ఈఓగా చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఈఓ మద్దిలేటి కాల్వబుగ్గ దేవస్థానానికి బదిలీకాగా.. ఆయన స్థానంలో యాగంటి దేవస్థాన ఈఓ చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆలయ సిబ్బంది ఈఓలను సత్కరించారు.

చెత్తబుట్టల పంపిణీ



చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న ఈఓఆర్డీ సుబ్బరాయుడు

ఓర్వకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం చెత్తబుట్టల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ సుబ్బరాయుడు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు తొలి విడత కింద 15 వేల చెత్తబుట్టలు మంజూరయ్యాయన్నారు. ఒక్కో ఇంటికి రెండు చొప్పున(తడి చెత్త, పొడి చెత్త) చెత్త బుట్టలను కేటాయించినట్లు తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, గుట్టపాడు సర్పంచు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామ ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు సోమవారం జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. జిందాల్ యాజమాన్యం నిరుపేద విద్యార్థులకు అవసరమైన నోట్‌పుస్తకాలను అందించడం అభినందనీయమని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు ఆదరణ ఏదీ !

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనిపించని ప్రత్యేక క్యూలు
- అందరితో పాటు క్యూలో నిలబడి నీరసం
- నిలబడలేక కుప్పకూలిపోతున్న వృద్ధులు
- కుటుంబ సభ్యులు ఎత్తుకుని ఓపీకి వెళ్లాల్సిన పరిస్థితి
- జిల్లాలో ప్రతి నెలా 40 వేల మందికి పైగా వృద్ధులకు చికిత్స
- నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): వృద్ధాప్యం ఏ ఒక్కరికీ శాపం కాకూడదు. వారికి ఆదరణ ఉండాలి. అభిమానం చూపించాలి. మేమున్నామనే భరోసానివ్వాలి. అప్పుడే వారు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా జీవనం గడపగలుగుతారు. అయితే ప్రస్తుత సమాజంలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇంట్లో పనులు చేసుకునే వృద్ధులుంటే ఫరవాలేదు. ఏ పనీ చేతగాకపోతే వారిని అనాథ శరణాలయాలు లేదా బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, ప్రభుత్వ ఆసుపత్రుల పాల్జేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో దాతలు పెట్టింది తింటూ జీవిత చరమాంకంలో రోజులు లెక్కపెడుతున్నారు. మరికొందరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చూసుకునే వారు లేక ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

కేంద్ర ప్రభుత్వం 2011లో మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో భాగంగా నేషనల్ ప్రోగ్రాం ఫర్ హెల్త్ కేర్ ఆఫ్ ఎల్డర్లీ(ఎన్‌పీహెచ్‌సీఈ)ని రూపొందించింది. ఇందులో భాగంగా వృద్ధులకు ప్రత్యేక ఓపీ అమలు చేయాలి. వారికి ప్రత్యేక వార్డు కేటాయించాలి. పునారావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. అవసరమైతే వైద్య సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందించాలి. అయితే ఇవేవీ జిల్లాలో సరిగ్గా అమలు కావడం లేదు. అందరితో పాటు వీరికీ వైద్యం అందిస్తున్నారు. కుటుంబసభ్యులు తోడుగా వస్తే వైద్యుల వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. ఎవ్వరూ లేకపోతే అన్నీ తిప్పలే.

జిల్లాలో గత ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 60 ఏళ్లకు పైబడిన వారు కేవలం 3,55,045 మంది చికిత్స పొందారు. గతేడాది ఇదే సమయానికి ప్రత్యేక ఓపీలు నిర్వహించడం వల్ల 14 లక్షలకు పైగా వృద్ధులు వైద్యం పొందారు. ప్రస్తుతం అందరితో పాటే వారికి ఆయా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. గతంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఇంటికే వెళ్లి చికిత్స అందించేవారు. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. నామమాత్రంగా వైద్యసేవలు అందిస్తున్నారు.

ప్రస్తుతం జిల్లా మొత్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి నెలా కేవలం వెయ్యి మందికి మాత్రమే అడ్మిషన్ కల్పిస్తున్నారు. అలాగే 600 నుంచి 700 వరకు రిహాబిలిటేషన్, ఇంటి వద్దకు వెళ్లి 1,500 మంది వరకు వైద్యం అందిస్తున్నారు. ఇప్పటివరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 333 మంది చికిత్స పొందుతూ మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ గణాంకాల్లో మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి ఒకే విధమైన అంకెలు వేయడం గమనార్హం. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనిచేయడం లేదో ఉద్యోగుల పొరపాటో తెలియదు గానీ ప్రభుత్వానికి సైతం ఇదే విధంగా సిబ్బంది లెక్కలు పంపిస్తున్నారు.



వృద్ధుడికి వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

జనవరి నుంచి ఆగస్టు వరకు చికిత్స పొందిన వారు

నెల	ఏరియా ఆసుపత్రి	సీహెచ్‌సీ	పీహెచ్‌సీ	యూపీహెచ్‌సీ	మొత్తం
జనవరి	2,686	2,136	29,587	8,484	42,893
ఫిబ్రవరి	2,665	2,156	34,995	9,305	49,121
మార్చి	2,291	1,114	30,795	8,698	42,989
ఏప్రిల్	2,291	1,114	30,795	8,698	42,898
మే	2,438	1,877	30,637	10,264	45,216
జూన్	2,553	1,254	29,622	10,303	43,733
జులై	987	1,714	29,558	10,075	42,334
ఆగస్టు	1,518	1,262	33,534	9,638	45,952

వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులు

మతిమరుపు, కీళ్లవాపులు, కీళ్లనొప్పులు, ఆయాసం, క్యాన్సర్, కంటిశుక్లం, చూపు తగ్గడం, వినికిడి శక్తి తగ్గడం, నిరాశ, డిప్రెషన్, మధుమేహం, రక్తపోటు, మగవారిలో ప్రొస్టేట్ గ్రంధి వాపు, మెదడు, నాడీ మండల వ్యవస్థలో సమస్య కారణంగా చిత్తవైకల్యం, అజీర్ణం, మలబద్దకం, నరాల అస్వస్థత, వణుకు, న్యూమోనియా, ఊపిరితిత్తుల సమస్యలు, చర్మం పొడిబారడం, నిద్రలేమి, అతి నిద్ర, పక్షవాతం, క్షయ, మహిళల్లో మూత్రం ఆపుకోలేని పరిస్థితి, మూత్ర మార్గం ఇన్‌ఫెక్షన్, గుండె జబ్బులు వస్తాయి.

వృద్ధాప్యంలో చురుగ్గా ఉండాలంటే..

- ముఖ్యంగా వ్యక్తిగత శుభ్రత పాటించాలి.
- రోజూ వాకింగ్, యోగా, పిల్లలతో లేదా తోటివారితో క్యారంబోర్డు, లూడో, చెస్ తదితర క్రీడలు ఆడాలి.
- సూర్యరశ్మి తగిలేలా తోటపని లేదా చిన్నచిన్న పనులు చేస్తుండడం మంచిది.
- కోరుకున్న ప్రదేశాలకు ప్రయాణించాలి.
- ఆసక్తి ఉన్న కళలు, చేతి పనులు చేయవచ్చు
- ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, ఇతర పోషకాహారం తీసుకోవాలి.
- దూమ, మద్యపానానికి దూరంగా ఉండాలి
- మంచి నిద్ర అలవాటు చేసుకోవాలి.
- బయటకు వెళ్లినప్పుడు గుర్తింపు కార్డు వెంట తీసుకెళ్లాలి. కుటుంబసభ్యుల ఫోన్ నంబర్లు, అత్యవసర మందులు వెంట ఉంచుకోవాలి.
- స్నేహితులతో కలిసి ఇష్టమైన సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనాలి.

వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



వృద్ధుల ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశిస్తున్నాం. ఈ మేరకు వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నాం. జిల్లాలో చాలా చోట్ల వృద్ధులకు ప్రత్యేక ఓపీ కొనసాగుతోంది. అన్ని చోట్లా ప్రత్యేక ఓపీ సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం. స్పెషలిస్టు వైద్యులచే చికిత్స, అవసరమైన మందులు, ఫిజియోథెరపీ అందేలా చర్యలు చేపడతాం. –హేమలత, ఎన్‌సీడీ జిల్లా అధికారి, కర్నూలు

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

- ఎయిర్ పోర్టులో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

ఓర్వకల్లు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్డీఓ శేషిరెడ్డి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్‌తోకలిసి ఆయన ఎయిర్ పోర్టులో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 11.40 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఓర్వకల్లు ఎయిర్ పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 1.05 గంటలకు పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, గ్రామ సభలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 3.35 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకొని అక్కడి నుంచి సాయంత్రం 4.10 గంటలకు విమానంలో బయలుదేరి 5 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని వెల్లడించారు. ఆయన వెంట అసిస్టెంట్ కలెక్టర్ కళ్యాణి, తహసీల్దార్ విద్యాసాగర్ ఉన్నారు.



ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

సమస్యలు పరిష్కరించండి



సి.బెళగల్ పీజీఆర్ఎస్‌లో సమస్యలను తెలుసుకుంటున్న అధికారులు

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అధికారులకు అర్జీలు అందజేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి మండల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కంబదహాల్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి, పోలకల్ శ్రీనివాసులు, సి.బెళగల్ వీరేష్, సంగాల రామాంజనేయులు ఇతర గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. అలాగే గ్రామాల్లో వీధి రోడ్లు, డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాముడు, డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్‌కుమార్, ఎంఈఓ జ్యోతి, ఐసీడీఎస్ కొత్తకోట సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, మండల గణాంకాధికారి ఆదినారాయణ ఉన్నారు.



తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, డీటీ పురుషోత్తంను అభినందిస్తున్న డీలర్లు

సి.బెళగల్: తమ సమస్యలను పరిష్కరించాలని మండల రేషన్ డీలర్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల డీలర్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తమ సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రేషన్ సరుకుల పంపిణీ విధానాన్ని డీలర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను, డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తంను డీలర్లు అభినందించారు. డీలర్లు శ్రీరాములు, ఎల్లేశ్వరబాబు, లింగేష్, కమాల్, గిడ్డయ్య, నాగమద్దిలేటి ఉన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

- ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో విజయనగరంలో జరిగే ఓక్ జూబ్లీ వేడుకలు, 20వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మహాసభల్లో మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, విద్యావేత్తలు, మేధావులు పాల్గొంటారన్నారు. విద్యాప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమం, సమాజ శ్రేయస్సు, మహిళా సాధికారత, నూతన జాతీయ విద్యా విధానం 2020, కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై అనుసరిస్తున్న విధానాలపై భల్లో చర్చించి తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా మహిళా కార్యదర్శి కవిత, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాపరెడ్డి, బాలస్వామి, రాంపుల్లారెడ్డి, శ్రీరాములు, మల్లికార్జున, మారెన్న, లక్ష్మీదేవి, లలిత, కోమలమ్మ, చంద్రావతి, ఆదిశేషమ్మ, హరిత పాల్గొన్నారు.



మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కాల్వలోకి దూసుకెళ్లిన కారు



పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం చెరువు తూమ్ కాల్వలోకి ఓ కారు దూసుకెళ్లడంతో ఒకరికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. సోమవారం పాణ్యం నుంచి బస్టాండ్‌కు బయలుదేరిన కారు.. మలుపు వద్ద అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఒకరికి గాయాలైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణాలపై ఆరా తీస్తున్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

పాణ్యం: ఈనెల 23న సుగాలిమెట్ట వద్ద కారు ఢీకొని గాయపడిన రుద్రవరం మండలం బిరవోలు గ్రామానికి చెందిన వెంకటయ్య (45) కోలుకోలేక మృతి చెందాడు. ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సోమవారం తెలిపిన వివరాలు.. వెంకటయ్యతోపాటు సునీల్ బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వెంకటసుబ్బయ్య కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హక్కులను వినియోగించుకోవాలి

పాణ్యం: ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తమ్మరాజుపల్లె గ్రామంలో సభ నిర్వహించారు. భూ, ఇతర సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రతి పౌరుడికి రాజ్యాంగం హక్కులు కల్పించిందని, వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని వారు ప్రజలకు సూచించారు.

సేవలతోనే గుర్తింపు

సేవలతోనే గుర్తింపు వస్తుందని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరెడ్డి బేతంచెర్లకు, ఆఫీస్ సబార్డినేట్ గోపాల్ గడివేములకు బదిలీపై వెళ్తుండటంతో వారిని సోమవారం కార్యాలయంలో సన్మానించారు.

నేడు పొలం పిలుస్తోంది

సి.బెళగల్: మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహిస్తామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో, మధ్యాహ్నం కంబదహాల్ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో కార్యక్రమం ఉంటుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాబ్‌మేళాతో ఉద్యోగావకాశాలు

కర్నూలు(సెంట్రల్): నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సూచించారు. సోమ వారం కలెక్టరేట్‌లో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ అక్టోబర్ 4న ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9.30 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేళా ద్వారా 17 ప్రైవేట్ కంపెనీలు 950 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన 18 – 45 వయస్సుగల వారు www.rkiuniverre.aprrdc.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 77994 94856, 96427 35717 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి, ఉపాధి కల్పన అధికారి దీప్తి, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ అధికారి ఎల్.ఆనంద్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు భవనం ఏర్పాటు చేయాలి

పాణ్యం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించి సొంత భవనం నిర్మించాలని సోమవారం నంద్యాల కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందించినట్లు ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న గదుల పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు, అధ్యాపకులు భయంభయంగా కాలం గడుపుతున్నారని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

గడివేముల: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సూచించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో సోమవారం నేరాలపై అవగాహన, గుడ్ టచ్ బాడ్ టచ్, మహిళా సంబంధిత నేరాలు, సైబర్ క్రైమ్, డ్రగ్స్, లోన్ యాప్ మోసాలు, రహదారి భద్రతా నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైనా ఆపద సమయంలో 100, 112కు ఫోన్ చేసి పోలీసుల సాయం పొందాలని ఎస్‌ఐ సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లపై క్లిక్ చేసేటప్పుడు లేదా డౌన్ లోడ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ కలిగి ఉంటే భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎంలు

ఓర్వకల్లు: పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈఓ–2 ఓంకార్ యాదవ్ సూచించారు. సోమవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, సర్వేపల్లె రాధాకృష్ణ విద్యార్థి మిత్ర తదితర పథకాల అమలుపై హెచ్‌ఎం రామచంద్రారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో సెమిస్టర్–2 ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలంచారు. భోజన తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వంట పాత్రలపై మూతలు వేసి, వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని వంట నిర్వాహకులకు సూచించారు.



కోడుమూరు ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో నడిరోడ్డుపై ఉన్న గుంతను సూచిస్తూ స్థానికులు ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక

అధికారులూ.. మేల్కొనండి!

కోడుమూరు రూరల్: రోడ్లకు మరమ్మతులు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రమాదరకరంగా ఉన్న గుంతలు పూడ్చడంలో వారి అలసత్వం కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో కొందరు స్థానికులు చొరవతీసుకొని ప్రమాద సూచికలను సైతం సొంతంగా ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో నడిరోడ్డుపై అడుగున్నర లోతు మేర గుంత ఏర్పడింది. నడిరోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి స్థానికులు పలుమార్లు తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతను గమనించకుండా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాల పాలవుతున్నారు. ఇలా రోజూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో వాటిని నివారించేందుకు చుట్టుపక్కల ఉన్న దుకాణదారులు గుంత ఉంది గమనించి వెళ్లాలంటూ ఓ ఎర్రటి డ్రమ్ములో మట్టి నింపి చెక్క టేబుల్, పాత సిమెంట్ ఖాళీ సంచిని ప్రమాద సూచికగా ఏర్పాటు చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేస్తారో లేదో వేచి చూడాలి.

పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

ఓర్వకల్లు: మండలాన్ని పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం సీపీఐ మండల కార్యదర్శి రమేష్, ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఓర్వకల్లు మండలాన్ని పరిశ్రమల హబ్‌గా ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. అయితే పరిశ్రమలు వస్తున్నా.. శిలాఫలకాలకే పరిమితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2014లో టీడీపీ నాయకులు పరిశ్రమల కోసం సేకరించిని భూముల యజమానులకు ప్రతి ఇంటికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. పరిశ్రమల్లో 75 శాతం స్థానిక యువతకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. 2022లో కేంద్ర అనుమతులు తీసుకొని వచ్చిన శిరిడీసాయి ఎలక్ట్రికల్ ప్రైవేట్ కంపెనీని రద్దు చేయాలని, ఉర్దూ యూనివర్సిటీ నిర్మాణానికి రూ.230 కోట్లు విడుదల చేయాలని కోరారు. మండల ప్రజలకు సోలార్ పరిశ్రమ ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని, మండలాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలనే డిమాండ్‌లతో కూడిన తీర్మానం చేశారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



ఎంపికైన జేఎన్టీయూఏ మహిళా జట్టు

పాణ్యం: జాతీయ స్థాయి యూనివర్సిటీ సౌత్ జోన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జేఎన్టీయూఏ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. సోమవారం శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పోటీలను జేఎన్టీయూఏ క్రీడల డైరెక్టర్ జోజిరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో జేఎన్టీయూ పరిధిలోని 30 ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 90 మంది మహిళలు, పురుషులు పాల్గొన్నారు. ఎంపికైన మహిళా జట్టు నవంబర్‌లో తమిళనాడు రాష్ట్రంలోని కరైకుడి జిల్లా అలగప్ప యూనివర్సిటీలో జరిగే జాతీయ బాల్ బ్యాడ్మింటన్ సౌత్ జోన్ క్రీడల్లో పాల్గొంటారు. బెంగళూరు నార్త్ యూనివర్సిటీలో జరిగే పోటీలలో పురుషుల జట్టు పాల్గొంటున్నట్లు కళాశాల పీడీ చంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పాణ్యం విద్యార్థినుల ప్రతిభ



కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

పాణ్యం: జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో పాణ్యం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 'స్వర్ణాంధ్ర 2047' అంశంపై నంద్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి వకృత్వ పోటీల్లో ఏపీ మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని ప్రవళ్లిక, ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని హర్షిత ప్రతిభ కనబరిచి జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుసుకున్నారు.